దేశంలో నియంతపాలన

- రాహుల్ గాంధీ అనర్హత వేటుపై నిరసన
- ఏటూరునాగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దీక్ష
- పాల్గొన్న ములుగు ఎమ్మెల్యే సీతక్క



మూతికి నల్ల రిబ్బన్ కట్టుకొని దీక్ష చేపట్టిన ఎమ్మెల్యే సీతక్క, నాయకులు

ఏటూరునాగారం: దేశంలో బీజేపీ ప్రభుత్వ నియంత పాలన కొనసాగుతుందని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసినందుకు నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్ష చేపట్టింది. ములుగు ఎమ్మెల్యే సీతక్క మూతికి నల్ల రిబ్బన్ కట్టుకొని ప్లకార్డులను చేతబూని నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం దీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ లోక్‌సభ ఎంపీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం సరికాదని ఖండిస్తున్నామన్నారు. ఎలక్షన్ సమయంలో ఎంతోమంది నాయకులు, ప్రతిపక్ష పార్టీ పాలక పక్ష నాయకుల మీద ప్రభుత్వంపై ఎన్నో మాటలు ప్రచార కార్యక్రమంలో అంటారని, కానీ, ఆ మాటను పాలక పక్షంలో ఉన్న ప్రభుత్వాలు పట్టించుకోవన్నారు. కానీ, బీజేపీ ప్రభుత్వం కావాలనే రాహుల్ గాంధీపై కుట్ర పూర్వకంగానే కేసులు పెట్టిఇరకాటంలో పెట్టాలని చూస్తుందన్నారు. భారత్ జోడోయాత్రకు ప్రజల్లో మహాస్పందన ఒర్వలేక రాహుల్ గాంధీపై కక్ష సాధింపునకు పాల్పడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని సీతక్క పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, ఎంపీటీసీ గుండ్ల శ్రీలత, దేవేందర్, మామిడి రాంబాబు, శ్రీను, గౌస్, వంగపండ్ల రవి, రాధిక, కొప్పుల శ్రీను, వావిలాల ఎల్లయ్య, సులేమాన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృది

మంగపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని తిమ్మాపురం, కొత్తచీపురుదుబ్బ, రామచంద్రునిపేట, దోమెడ తదితర గ్రామాల్లో సీతక్క మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని, రూ.500కు గ్యాస్ సిలిండర్ ఇప్పిస్తామని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి రాష్ట్రంలో అధికారంలోని రావడం కోసం ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతక్క మాట్లాడారు. మండలంలో కలిసి మెలిసి ఉంటున్న గిరిజన, గిరిజనేతరుల మధ్య కొందరు వ్యక్తులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం వైశామ్యాలు సృష్టిస్తున్నారన్నారు. మండలంలో రెవెన్యూ అధికారులు ఓ పత్రికా విలేఖరి, ఒకరిద్దరు బ్లాక్ మెయిలర్స్ కుమ్మక్కై మండలంలోని అభివృద్ధి పనులకు అడ్డు పడుతు పనులు జరుగకుండా అడ్డు కుంటున్నారని స్థానిక ప్రజలు తన దృష్టికి తెచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రైతులు ఇండ్ల నిర్మాణం కొరకు మట్టి, ఇసుక తెచ్చుకుంటుంటే అడ్డుతగులుతున్నారని, స్వంత ట్రాక్టర్లతో రోడ్డు నిర్మాణంకోసం మట్టి తీస్తే రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను సీజ్‌చేసి జరిమానా విదిస్తు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారని విషయంపై తాను స్వయంగా కలెక్టర్‌కు వివరించామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విషయంపై విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో కొందరు రెవెన్యూ అధికారులు, ఏటూరునాగారం ఐటీడీఏలోని కొందరు అధికారులు కొందరిని ఏజెంట్లుగా పెట్టుకుని రైతులను డబ్బులు ఇవ్వాలని లేని పక్షంలో నోటీసులు ఇస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తన నియోజకవర్గంలో ప్రజలను ఇబ్బందులు పెడుతున్న అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల మృతి చెందిన పలువురు బాధిత కుటుంబాలను సీతక్క పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొమరం ధనలక్ష్మి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, పెద్ది నర్సింహారావు, చౌళం వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి, యాదగిరి, యానయ్య, బగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీ ఎదుట పెట్రోల్ బాటిల్‌తో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబం


పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబీకులు, బంధువులు

- ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఆందోళన

మంగపేట: తన ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపిస్తు మండలంలోని నర్సింహాసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ముద్దంగుల రాంబాబు పెట్రోల్ బాటిల్ పట్టుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి బైటాయించి నిరసన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం జరిగే వరకు కదిలే ప్రసక్తే లేదని న్యాయం జరుగకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళనకు దిగాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 ఏళ్ల క్రితం నుంచి నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరడంతో అప్పుచేసి నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. గ్రామానికి చెందిన అధికార బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఆ స్థలం తనదని తన అనుమతి లేకుండా ఇల్లు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశాడని గ్రామ పంచాయతీ అధికారులు ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఆరోపించాడు. తాను గత 40 ఏళ్ల నుంచి ఉంటున్న ఇంటికి పన్ను చెల్లించిన రసీదులు కూడా ఉన్నాయని ఇంటి పన్ను తీసుకున్న పంచాయతీ అధికారులు నూతన ఇంటిని నిర్మిస్తుంటే అడ్డుకుంటు ఇబ్బందులకు గురిచేయడంపై పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 100 మంది గ్రామస్తులు, పలువురు పెద్ద మనుషులు సైతం బాధితుని పక్షాన నిలిచారు. 40 ఏళ్ల క్రితం నుంచి నివాసం ఉంటున్న వ్యక్తి ఇల్లు కట్టుకుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. సంబంధిత అధికారులు ఇంటి నిర్మాణం పనులు అడ్డుకోకుండా విషయంపై స్థానికంగా విచారించిన తదుపరి చర్యలు తీసుకోవాలని, పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. విషయంపై పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్‌ను వివరణ కోరగా గ్రామానికి చెందిన కుంట ఏడుకొండలు తన వ్యవసాయ భూమిలో తన అనుమతి, గ్రామ పంచాయతీ నుంచి లేకుండా వేరొకరు ఇంటి నిర్మాణం చేస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశాడు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పనులు అడ్డుకున్నాము. పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీపీఆర్‌తో ప్రాణాపాయస్థితి నుంచి కాపాడొచ్చు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిఖిల్‌కుమార్

మంగపేట: గుండెపోటుకు గురైన వారిని సీపీఆర్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడొచ్చని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి అల్లి నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు, ఆశావర్కర్లకు సీపీఆర్‌పై శిక్షణ కార్యాక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగపేట, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్, కారం నిఖిల్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు గుండెపోటు వచ్చిన సమయంలో అంబులెన్స్ వచ్చే సమయంలో ముఖ్యమైన ప్రాణరక్షిత క్రియపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా గుండెపోటుకు గురైనట్లు గుర్తించడం ఎలా అనే అంశంపై వివరించారు. గుండె పోటుకు గురై నాడీ వ్యవస్థ పనిచేయనప్పుడు రక్త సరఫరా నిలిచిపోతుందన్నారు. వెంటనే సీపీఆర్ చేస్తే కొంత ఉపశమనం ఉంటుందన్నారు. సీపీఆర్ చేయాల్సిన విధానంపై కార్యక్రమానికి హాజరైన ఆశావర్కర్లు, పంచాయతీ రాజ్, రెవెన్యూ తదితర శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మంగపేట: మండలంలోని రాజుపేటలో ఈనెల 03న జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని రాజుపేటలో అన్ని గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులతో మంగళవారం సమేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్సీ, ఆత్మీయ సమ్మేళనం ములుగు జిల్లా ఇన్‌చార్జ్ అరికెల నర్సిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ తుమ్మ మల్లారెడ్డి, మండల నాయకులు రాజు యాదవ్, చిట్టిమళ్ళ సమ్మయ్య, ఎడ్లపెల్లి నర్సింహారావు, పచ్చా శేషగిరిరావు, శిద్ధశెట్టి వైకుంఠం, వీరస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలి


చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: గౌడ గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందించాలని సర్వాయి పాపన్న గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ కోరారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారంహైదరాబాద్‌లో తాడి కార్పొరేషన్ చైర్మన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేష్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా శ్రీపతి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో అనేకమంది గీత కార్మికులు తాటిచెట్లుపై నుంచి పడి తీవ్ర గాయాలకు గురై మరణించడం వలన ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి తయారుచేసిన సేఫ్టీ మోకులను గౌడ, గీత కార్మికులకు తక్షణమే అందజేస్తే కొంతమేరకైనా ప్రమాదాలు నివారించి, గీతాకార్మికుల ప్రాణాలను కాపాడొచ్చని విన్నవించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన బుర్ర వెంకటేశంగౌడ్, మంత్రితో మాట్లాడి త్వరలోనే గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర రమేష్ గౌడ్, గోపి, జిల్లా నాయకులు పెరుమాండ్ల రవీందర్, బుర్ర శ్రీధర్, ఉయ్యాల రమేష్, సాంబయ్య, శ్రీపతి రమేష్, గొల్లపల్లి రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న మోదీ సర్కార్

భూపాలపల్లి: ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతూ ప్రధాని మోదీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాడని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ.. అదానీ కుంభకోణాలపై రాహుల్ ఘాటుగా ప్రశ్నించడంతో పీఎం ఉక్కిరిబిక్కిరై సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. ఆయనను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కుట్ర పన్ని సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నెలకొందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, శ్రీదేవి, ఇస్లావత్ దేవన్, దాట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రం పరిశీలన



వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను తహసీల్దార్ గూడూరు లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. మంగళవారం జనరల్ పరీక్షలకు 96 మంది హాజరవ్వాల్సి ఉండగా 86 హాజరయ్యారు. ఒకేషనల్‌లో 38 మందికి గాను 33 మంది హాజరయ్యారు. 15 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు.

రాంబాబుకు లెజెండ్ అవార్డు



మంగపేట: ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరునాగారం మండలం రామన్నగూడెంకు చెందిన మామిడి రాంబాబును క్రాంతిజ్యోతి మహిళా సాధికారత స్వచ్ఛంద సంస్థ జాతీయ స్థాయి ఉగాది –2023 లెజెండ్ అవార్డుతో సోమవారం సత్కరించింది. హనుమకొండ జిల్లా పరకాల మండల పరిధిలోని పద్మశాలి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సినిమా రంగంలో ఆర్టిస్టుగా రాణిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాంబాబును ఆహ్వానించి ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రజనిరుద్రమ అవార్డుతో రాంబాబును సత్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు రాంబాబుకు అభినందనలు తెలిపారు.

సరుకుల పంపిణీ



వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో ఉన్న డే కేర్ సెంటర్‌లోని పేద విద్యార్థులకు మంగళవారం గాస్పెల్ సర్వీస్ సొసైటీ ఖమ్మం వారి సహకారంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 65మంది విద్యార్థులకు పాస్టర్ కంతి శ్యామ్ సరుకులను అందించారు.

పరామర్శ



ఎస్ఎస్ తాడ్వాయి: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఊటుకూరి సాయిరాం తల్లి సత్యవతి (75) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్ పరామర్శించారు. మృతురాలి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బండారి రమేష్, గొని మధు, పిట్టల పోశాలు, రేగుల మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

చేయూత



ములుగు రూరల్: మండలంలోని రాయినిగూడెం, సర్వాపూర్ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తవిటి సాంబయ్య, లక్ష్మయ్య కుటుంబాలకు శ్రీ రామక్రిష్ణా సేవాట్రస్టు ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఈ మేరకు మంగళవారం ట్రస్టు చైర్మన్ బాడిశ నాగ రమేష్ బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు కుటుంబానికి రూ.2వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీడబోయిన స్వామి, జయమ్మరవి, రవిగౌడ్, నవీన్, ఆదినారాయణ, రమేష్, ప్రవీణ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే భేటీ

ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలంలోని గోదావరి ఒడ్డు వెంట ఉన్న కరకట్ట పటిష్టపై ఇరిగేషన్ అధికారులతో ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. వర్షాకాలంలో గోదావరి ఉధృతి పెరుగుతుంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. కరకట్ట పనుల జాప్యం మూలంగా ఈ ఏడాది పనులు జరిగే అవకాశం లేదన్నారు. తూము షట్టర్ల పనులు పూర్తి చేయాలని చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పనులు వేగంగా చేయించాలని అధికారులను ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వాజేడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాజేడు ఎస్సై రేక అశోక్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ క్రైమ్‌లు ఎక్కువయ్యాయని ప్రతీ ఒక్కరు అప్రమేత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, డయల్ 100, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్ నేరాలపై విద్యార్థులకు సమగ్రమైన అవగాహన కల్పించారు. చదువు ప్రాధాన్యత, జీవితంలో ఎదుగుదల తదితర అంశాలపై వివరించారు.

నియామకం


నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

మంగపేట: కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా బోరునర్సాపురానికి చెందిన నర్రా కిశోర్, చెల్లిపెల్లి వెంకటేశ్వర్లును నియమిస్తూ ములుగు ఎమ్మెల్యే సీతక్క మంగళవారం నియామకం పత్రాన్ని అందచేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన సీతక్క మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు నూతన వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా కిశోర్, వెంకటేశ్వర్లును ప్రకటించి వారికి నియామకం పత్రాన్ని అందచేశారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్ని పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు అర్థమయ్యే విదంగా ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జయరాంరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, మండల నాయకులు నర్సింహారావు, యానయ్య, భగవాన్‌రెడ్డి, కారుపోతుల నర్సయ్య, హుస్సేన్, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ములుగు రూరల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీ జరిగి లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే సీఎం కేసీఆర్ స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. పేపర్ లీకేజీలతో నష్టపోయిన విద్యార్థులకు పరిహారంగా రూ.20వేలు అందించి ఆదుకోవాలన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని కోరారు. లీకేజీలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ కమేష్, లక్ష్మణ్, సాయి చరణ్, ముషారఫ్, బాలు, స్వామి, రవితేజ, సుమంత్, శివకేశవ్ పాల్గొన్నారు.

ఉత్తరాలు రాయడంపై విద్యార్థులకు అవగాహన


ఉత్తరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ములుగు రూరల్: మండలంలోని బరిగలానిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉత్తరాలు రాయడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొత్తపల్లి పోషన్న అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 20 మంది ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్‌లకు ఉత్తరాలను రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4వ తరగతి తెలుగు పాఠ్యాంశంలో మాటల ప్రయాణం, పోస్టాఫీస్, పోస్టు కార్డును ఎలా రాయాలని అంశంపై అవగాహన కల్పించామని తెలిపారు. గ్రామంలో విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్, పంటకు వాడుతున్న రసాయన మందుల వాడకం నివారించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తెలుగులో విద్యాబోధన, పాఠశాలలో ఒకపూట తరగతులు, మిగిలిన పూట ఆట, పాటలు నిర్వహించాలని విద్యార్థులు ఉత్తరాలు రాసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలోపాఠశాల ఉపాధ్యాయుడు రతన్‌సింగ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కొట్టేసిన దొంగ


పోలీసులు విడుదల చేసిన దొంగ ఫొటో

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొప్పుల శ్రీనివాస్‌కు చెందిన ఏటీఎం కార్డును దొంగలించి అతడి అకౌంట్ నుంచి రూ.30వేలు దొంగలించినట్లు ఎస్సై రమేష్ మంగళవారం తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఏటీఎం వద్ద కొప్పుల శ్రీనివాస్ ఏటీఎం మిషన్ నుంచి డబ్బుల డ్రా కోసం ఏటీఎం పిన్‌ను నమోదు చేస్తుండగా అతడి దృష్టి మరల్చిన ఓ దుండగుడు పిన్‌ను అతడి సెల్‌లో ఫీడ్ చేసుకున్నాడు. ఈ మేరకు ఎంపీటీసీ ఎంటీఎం కార్డు సైతం దొంగలించి ఆకులవారి ఘణపురంలోని కెనరా బ్యాంక్ ఏటీఎం నుంచి రూ.30వేల డ్రా చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ వద్ద ఉన్న సీసీ కెమెరాలో నమోదు అయిన పుటేజీలను అతడి ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. గుర్తు పట్టిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఖాతాదారులు ఏటీఎంలో డబ్బులు డ్రా చేసే సమయంలో పక్కన ఎవరు లేకుండా చూసుకోవాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్


ఎన్‌సీసీ సెలెక్షన్స్ చేస్తున్న అధికారి రాజయ్య

మొగుళ్లపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో పాటు దేశభక్తిని అలవర్చుకోవడానికి, దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవడానికి వారి ఉజ్వల భవిష్యత్‌కు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్‌సీసీ అధికారి గుండెల్లి రాజయ్య, ఆర్మీ అధికారి హవల్దార్ విజయ్, ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి అన్నారు. మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2023 –24 సంవత్సరానికి గాను ఆర్మీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సెలక్షన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో 43 మంది గాను 10 మంది బాలికలు, 33 మంది బాలురు పాల్గొనగా సామర్థ్య పరీక్షల ద్వారా 8 మంది బాలికలు 17 మంది బాలురలను ఎంపిక చేసినట్లు రాజయ్య, విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెలక్ట్ అయిన విద్యార్థులకు రెండు సంవత్సరాల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సమాజ సేవాభావాన్ని పెంపొందించుటతోపాటు క్రమశిక్షణ మానసిక శారీరక అభివృద్ధికి సంబంధించిన శిక్షణ ఇస్తామని తెలిపారు. డ్రిల్, ఆయుధాల శిక్షణ, మ్యాప్‌రీడింగ్ లాంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని వీటితోపాటు క్యాంపులకు హాజరు కావడం వల్ల సోదరభావం నాయకత్వ లక్షణాలు దేశ సంస్కృతి, భాషలు మొదలగు అంశాలు పెంపొందుతాయని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ


విద్యార్థులకు ప్యాడ్‌లు ఇస్తున్న అరుణ్

మల్హర్: మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బీఆర్‌ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు ఎడ్ల అరుణ్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా అరుణ్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సమ్మయ్య, నార రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్

చిట్యాల: ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఒడితల గ్రామం నుంచి ట్రాక్టరులో ఇసుక రవాణా చేస్తుండగా దూత్‌పల్లి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణప్రసాద్ వెల్లడించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అందుకుతండా గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ హట్కార్ రాజేష్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై ఈశ్వరయ్య, కానిస్టేబుల్ సిద్ధార్థ, లాల్ సింగ్ పాల్గొన్నారు.